క్లుప్తంగా

ఎమ్మెల్యే చొరవతో ధ్రువపత్రాల మంజూరు

మాకవరపాలెం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ చొరవతో తూర్పుకాపులకు బీసీ–డీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్టు ఆ సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు శుక్రవారం తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మండలంలోని తూర్పుకాపులకు బీసీ–డీ ధ్రువపత్రాలు అందించడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. తూర్పుకాపు సంఘం తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులు పాశపు నాగేశ్వరరావు, తోట సత్తిబాబు, తిప్పన వెంకటరమణ పాల్గొన్నారు.

ఆట పాటల్లోనూ రాణించాలి



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న వైస్ ఎంపీపీ లక్ష్మి

మాకవరపాలెం: విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గౌతమి లలితకళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో నెల రోజులపాటు కొనసాగిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. దీంతోపాటు సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, గౌరవ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభ వెలికితీత



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సౌమ్య

కె.కోటపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి పోటీ పరీక్షలు దోహద పడతాయని గ్రంథపాలకురాలు సౌమ్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పర్యావరణం–పచ్చదనం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 11న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



వలంటీర్లను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి బాలాజీ, సర్పంచ్ దేముళ్లు

కె.కోటపాడు: ప్రజలకు విశేష సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లు అభినందనీయులని గుల్లేపల్లి గ్రామ ప్రత్యేకాధికారి బి.బాలాజీ అప్పారావు తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో 14 మంది వలంటీర్లను దుశ్శాలువాలతో సన్మానించారు. సేవా మిత్ర పురస్కారం, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. మరింతగా మెరుగ్గా సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరును తీసుకు రావాలని సర్పంచ్ బండారు దేముళ్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల 30వ తేదీ నుంచి వీటిని ఇక్కడ ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. మహిళా కోలాటం ఆకట్టుకుంది. ఈ నెల 4న స్వామివారి వసంతోత్సవం, ఊంజల్‌సేవ, దర్పదర్శనం, పుష్పాంజలిసేవ, నాగవల్లి సంబరాలు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

రోడ్డు విస్తరణ మార్కింగ్‌పై విమర్శలు

ఇష్టానుసారంగా కొలుస్తున్న సర్వే బృందం



మార్కింగ్ చేస్తున్న సిబ్బంది



కొత్తకోట మూడు రోడ్ల కూడలిలో నిత్యం ట్రాఫిక్ దుస్థితి

రావికమతం: కొత్తకోటలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆక్రమణలు తొలగించేందుకు సర్వే సిబ్బంది వేసిన మార్కింగ్ పలు విమర్శలకు తావిస్తోంది. రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి చోడవరం మండలం గంధవరం వరకు విస్తరణ పనులను న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ.104 కోట్లతో చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే అన్ని గ్రామాల్లో ఆక్రమణలు గుర్తించి తొలగించగా, కొత్తకోటలో మాత్రం 15 ఏళ్లుగా విస్తరణకు నోచుకోలేదు. దీంతో రహదారికిరువైపులా ఆక్రమణలకు గురయ్యాయి. రెండు బస్సులు ఎదురెదురుగా వస్తే వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 40 అడుగుల తొలగిస్తారని మొదట్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బహిరంగ సభలో ప్రకటించారు. అలాగైతే దుకాణాలు కొన్ని కనుమరుగవుతున్నాయని భావించి ఇరువైపులా 35 అడుగులకు చేస్తారన్నారు. ఆ తర్వాత 30 అడుగులకు తగ్గించారు. తరచూ స్థానిక నాయకులతో సమావేశాలు మాత్రం నిర్వహిస్తున్నా, పనుల్లో మాత్రం కదలిక లేదు. ఎట్టకేలకు ఈ నెల 26న సర్వే బృందం మార్కింగ్ చేయగా, పలు విమర్శలకు తావిస్తోంది. స్టేట్‌బ్యాంకు, స్థానిక పంచాయతీ, మండల పరిషత్ దుకాణ సముదాయం వద్ద 70 అడుగుల విస్తీర్ణం మేర మార్కింగ్ చేయగా, తరచూ రద్దీగా ఉండే మూడురోడ్ల కూడలిలో మాత్రం 50 అడుగులకు తగ్గిపోయింది. మరలా సెంటర్ దాటిన తర్వాత విశాలంగా మార్కింగ్ చేశారు. ఒక్కో చోట ఒక పక్కకు ఎక్కువ గానూ మరొక చోట మరొక పక్కకు తక్కువగా మార్కింగ్ చేయడంతో వ్యాపారులు కేదారిశెట్టి వాసు, నివాసితులు గణ్రెడ్డి చంటిబాబు, తడి రమేష్ తదితర్లు పలు విమర్శలు చేసున్నారు. రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా సమానంగా తీస్తామని ప్రకటించి ఇప్పుడిలా చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఎవ్వరికో మేలు చేయడం కోసం ఇలా చేయడం సబబు కాదని ఉన్నతాధికారులు కల్పించుకుని సమన్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇరువైపులా 40 అడుగుల మేర మార్కింగ్ : విప్ ధర్మశ్రీ

కొత్తకోట మార్కింగ్ విషయాన్ని ఇటీవల పలువురు నాయకులు విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకువచ్చారు. సర్వే సిబ్బంది లాలూచీ పడటమో, లేదా బెదిరింపులకు భయపడి తప్పుడు మార్కింగ్ ఇస్తే సహించబోనని కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గతంలోనే రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 40 అడుగుల మేరకు మార్కింగ్ ఇవ్వాలని కలెక్టర్ నుంచి, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఆ విధంగా సర్వే చేయాలని, విమర్శలకు తావివ్వవద్దని సిబ్బందిపై మండిపడ్డారు.

హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లోకి వస్తున్నాం..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



లక్ష్మీపురంలో మహిళలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను నెరవేర్చడంతోనే తాము ధైర్యంగా ప్రజల్లో వస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వీరవల్లి పంచాయతీ శివారు గ్రామాల్లో రెండో రోజు శుక్రవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఎరుకువాడ శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు ప్రతిపాదనలు పరిశీలించారు. ఇటీవల పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధం కావడంతో బాధిత రైతు శానాపతి రమణను పరామర్శించారు. తలారి జీవన్‌బాబు ఇటీవల మృతి చెందగా, ఆయన కుమార్తె శ్రావణికి రూ.2 వేల అందించారు. లక్ష్మీపురం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీపురం నుంచి కె.జె.పురం ప్రధాన రహదారికి పోవు మట్టి రోడ్డును పరిశీలించారు. అత్యవసర పనుల నిమిత్తం రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. పంచాయతీ పరిధిలో 3,596 మంది లబ్ధిదారులకు 21 సంక్షేమ పథకాల ద్వారా రూ.8,68,76,317 లబ్ధి చేకూరిందన్నారు. అభివృద్ధి పనులకు రూ.93.84 లక్షలు మంజూరు చేశామన్నారు. కొత్తూరులో సింగిల్ టాన్స్‌ఫార్మర్ వల్ల సమస్య ఉన్న దృష్ట్యా ఆదనంగా స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ఏఈని ఆదేశించారు. లక్ష్మీపురం, ఎరుకువాడ మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై ఆరా తీశారు. సీమంతాల కార్యక్రమంలో గర్భిణులను ఆశీర్వదించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణహరి, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, మాజీ ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, పార్టీ సచివాలయ కన్వీనర్ కామాకుల కామరాజు, నాయకులు బోగాది శంకర్రావు, కోన శ్రీను, బోగాది జోగారావు, దొండా నాగమణి, పచ్చికూర రామారావు, ఇల్లపు పిట్టనాయుడు, మల్లేటి భీమేశ్, పినపల్లి సంజీవిరావు, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

నర్సీపట్నం చేరుకున్న జీపుజాతా



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జీపు జాతా శుక్రవారం నర్సీపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు జాతాలు మే1న ప్రారంభమై, జూన్ 8న విజయవాడ చేరుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో 40 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారన్నారు. వీరందరిని పర్మినెంట్ చేయాలన్నారు. వీరికి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కోటి, వరలక్ష్మి, బి.శ్రీనివాసరావు, కుపరాల రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుద్దీపాలంకరణలో దేవరాపల్లి



దేవరాపల్లిలో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల భారీ కటౌట్



విద్యుత్ కాంతులీనుతున్న దేవరాపల్లి ప్రధాన రహదారి

- సన్యాసమ్మ పండగకు భారీగా ఏర్పాట్లు
- 12 ఏళ్ల తర్వాత అమ్మవారి నెల రోజుల పండగ

దేవరాపల్లి: స్థానిక గ్రామ ప్రజల ఇలవేల్పు సన్యాసమ్మ అమ్మవారి పెద్ద పండగను ఈ నెల 6న భారీగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 12 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న అమ్మవారి నెల పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దాదాపుగా ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జాతరలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా మహేశ్వరి థియేటర్ వరకు రోడ్డు పొడవునా విద్యుత్ దీపాలను అలంకరించడంతో గ్రామమంతా కాంతులీనుతోంది. పలు చోట్ల ఏర్పాటు చేసి దేవతామూర్తుల భారీ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అమ్మవారి జాతరకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి వేలాదిగా భక్తజనం తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: వీరవల్లి మోదకొండమ్మ పీఠంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు తొలుత ఆయన్ను సాదరంగా ఆహ్వానించి పూజలు చేయించారు. అనంతరం మాలాధారణ భక్తులు సన్మానించారు. పాలకుర్తి మంగరాజు పాల్గొన్నారు. ఈ పీఠంలో గత నెల 23 నుంచి అమ్మవారికి పూజలు, మాలాధారణ, సారె, ఘటాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటనపై రెండు రోజుల తర్వాత వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన చంబకాయల లోవరాజు, పూడి రత్నం గత నెల 31న యలమంచిలి కూలీ పనికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నూతలగుంటపాలెం వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టి పరారైంది. దీంతో లోవరాజు, రత్నం రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడగా స్థానికులు అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చంబకాయల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గణేష్



ఏఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: స్థానిక ఏఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణాను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు అందుబాటులో పశువైద్యం



సమావేశంలో పశువైద్యాధికారి మౌనిక

కె.కోటపాడు: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారానే పశువైద్యం సకాలంలో అందాలని చౌడువాడ పశువైద్యాధికారి మౌనిక తెలిపారు. ఇటీవల కడప నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆమె శుక్రవారం ఆర్బీకే పశువైద్య సహాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతాంగానికి అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను రైతులకు సకాలంలో వివరించడంతోపాటు వాటిని రైతులు పొందేలా చర్యలను తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ పశు బీమా పథకంలో చేర్పించాలన్నారు. రాయితీ గడ్డి, టీఎంఆర్ దాణాను ఇస్తున్నట్లు తెలిపారు.

ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు



రామయ్యమ్మకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారి మౌనిక

రావికమతం: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక శుక్రవారం పి.పొన్నవోలు వెళ్లారు. అక్కడ మంచానికి పరిమితమైన పులకండం రామయ్యమ్మ(88)కి వైద్య సేవలందించారు. బీపీ, ఇతర పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి పలువురిని పరీక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సన్యాసమ్మ అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

దేవరాపల్లి: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం సన్యాసమ్మ అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి నెల రోజులు పండగలో భాగంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, తదితర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఘనత జగన్‌దే

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: అర్హతే కొలమానంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. రెండో రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏఎల్‌పురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత వాడల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి మహిళలకు వివరించారు. నవరత్నాలు ప్రతీ ఇంటికి అందడం వల్లే ఈ రోజు ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామన్నారు. గత పాలనలో సక్రమంగా సంక్షేమ పథకాలు అందేవి కావని, జన్మభూమి కమిటీల సిఫార్సుతో ఇచ్చేవారని విమర్శించారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదన్నారు. అర్హులందరికీ నేరుగా ఇంటికే వచ్చి సంక్షేమ పథకాల నగదు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి మంచి మనసున్న సీఎంకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని తెలిపారు. నిజాయతీగా పాలన చేయడంతోనే దేశంలో ఉత్తమ ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీ తూచా తప్పకుండా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ విభాగం మహిళా జిల్లా అధ్యక్షురాలు, ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ బుల్లిప్రసాద్, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, స్థానిక నాయకుడు శివతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

ఎంపీపీ రుత్తల సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ ఆదేశించారు. ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు కూడా స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు కొండలఅగ్రహారం ప్రాంత విషయమై మాట్లాడుతుండగా సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ అడ్డుతగిలారు. తమ గ్రామానికి సంబంధించి మీరు మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఎంపీపీ కలుగజేసుకుని ఏ గ్రామానికి సంబంధించి వారే మాట్లాడాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళిక



వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి

నాతవరం: ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంతోపాటు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోలు, వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటుతామన్నారు. దీనికి సంబంధించి మండల వ్యాప్తంగా ఖాళీ ప్రదేశాలను గుర్తిస్తున్నామన్నారు. వీటిని నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. వీటితోపాటు డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై వివరిస్తున్నామన్నారు.

రూ. 6.24 కోట్ల రైతు భరోసా సొమ్ము జమ

రూ.36.11 లక్షల విలువైన యంత్ర సామగ్రి పంపిణీ



ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో భాగంగా మండలంలో 11,348 మంది రైతుల ఖాతాల్లో రూ. 6.24 కోట్ల మేర రైతు భరోసా సొమ్ము జమ చేశామని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఒక్కో రైతుకు రూ.7,500 చొప్పున జమ చేశారని, వీటిలో రాష్ట్రం రూ.5,500, కేంద్రం రూ. 2 వేల చొప్పున జమ చేశాయన్నారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో రెండో విడతలో సీహెచ్‌సీ గ్రూపుల ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలు తీసుకున్న రైతులకు 40 శాతం సబ్సిడీని గ్రూపు ఖాతాల్లో జమ చేశారన్నారు. మండలంలోని ఏడు సీహెచ్‌సీ గ్రూపుల కలిపి రూ.36.116 లక్షల విలువైన యంత్ర పరికరాలు తీసుకున్నారన్నారు. దీనికి గాను 40 శాతం సబ్సిడీ కింద రూ. 11.87 లక్షలను గ్రూపు ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ యంత్ర సేవా పథకాల్లో ఎవరికైనా నగదు జమకాకుంటే స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించడం సాధ్యపడుతుందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలుదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, అతి వేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనం నడపొద్దని, భద్రతను తెలుసుకో.. బంధాన్ని పెంచుకో, నిదానమే ప్రధానం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఏపీఎం ఎస్. ప్రభాకర్, వెలుగు సీసీలు, వీవోఏలు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

మాడుగుల: స్థానిక ఆర్‌సీఎం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు 56 మంది విద్యార్థులకు గాను 44 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు. ప్రత్యేక స్క్వాడ్ రవీంద్రబాబు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

నేడు కమ్యూనిటీ భవనం ప్రారంభం

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో శనివారం అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతోపాటు ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని వారు ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

CHANGE OF NAME

I, VEGESINA SAI JYOTHI W/o Vegesina Venkata Ramana Raju, Residing at D.No.6-46, Sugar Factory Quarters, Amberupuram, Chodavaram (Mandal), Anakapalli District-531023, (AP) have changed my Name PENUMATSA SAI JYOTI (premarital Old Name) to VEGESINA SAI JYOTHI (in the surname of Husband New Name). Hence forth all documents will continue with my New Name VEGESINA SAI JYOTHI

మహిళా రెజ్లర్లకు మద్దతుగా నిరసన

మాడుగుల రూరల్: మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణసింగ్ లైంగిక వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు తెలిపారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మాడుగులలో నిరసన వ్యక్తం చేశారు. అతడిపై ఫిర్యాదు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడబండి రాజు, బీసీ సెల్ మండల కన్వీనర్ బాలిబోయిన అప్పారావు యాదవ్, ఏసురాజు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com